క్లుప్తంగా

సీపీఐ నేత రామారావుకు నివాళి



రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సత్యనారాయణమూర్తి

గాజువాక: సీపీఐ నాయకుడు, గాజువాక చిల్లర వర్తకుల సంఘం అధ్యక్షుడు ఎం.రామారావుకు ఆ పార్టీ నాయకులు బుధవారం నివాళులర్పించారు. గాజువాక మార్కెట్‌లో నిర్వహించిన సంతాప సభలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మార్కెట్ అభివృద్ధితోపాటు చిల్లర వర్తకుల సంక్షేమం కోసం రామారావు చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన ఆకస్మికంగా మృతి చెందడం సంఘానికి, పార్టీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎ.జె.స్టాలిన్, ఆడారి సూరిబాబు, షేక్ రెహ్మాన్, కసిరెడ్డి సత్యనారాయణ, ఎం.మన్మథ రావు, ఎస్.నాగభూషణం, వనజాక్షి, జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా వెంకటరమణ



పెట్లి వెంకటరమణ

అక్కిరెడ్డిపాలెం: విశాఖ జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య నూతన అధ్యక్షుడిగా 69వ వార్డు తుంగ్లాం గ్రామానికి చెందిన ఉక్కు ఉద్యోగి పెట్లి వెంకటరమణ నియమితులయ్యారు. పద్మశ్రీ మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షులు మాదిగ తనను నియమించినట్లు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ముస్తాబైన అమ్మవార్ల ఆలయం



విద్యుత్ కాంతుల్లో అమ్మవార్ల ఆలయం

నేడు బంగారుమాంబ అనుపోత్సవం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం గ్రామ దేవతలైన బంగారుమాంబ, నూకాంబిక అమ్మవార్ల నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 21న ప్రారంభమైన ఉత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. దీంతో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పరిసరాలను అందంగా ముస్తాబు చేశారు. చివరిరోజు గురువారం సత్తెమ్మ తల్లి పండగ, సాయంత్రం బంగారుమాంబ అమ్మవారి అనుపు మహోత్సవం నిర్వహించనున్నారు. వివిధసాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

మహారాణిపేట: అగనంపూడి సమీపంలో టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఆర్టీసీ బస్సుకు ప్రమాదం జరిగింది. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో అగనంపూడి హనుమాన్ జంక్షన్ వద్ద టిప్పర్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో కాకినాడ నుంచి విశాఖ వస్తున్న ఆర్టీసీ బస్సు టిప్పర్‌ను ఢీ కొట్టింది. ఆర్టీసీ డ్రైవర్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఆర్టీసీ డ్రైవర్ చాకచక్యంగా సడన్ బ్రేక్ వేసి ప్రయాణికులకు ప్రమాదం జరగకుండా బస్‌ను అదుపుచేశారు.బస్సులో సుమారు 45 మంది ప్రయాణికులు ఉన్నారు. అక్కడ ట్రాఫిక్ పోలీస్ ఉన్నా సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతోనే ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

అగనంపూడి/పెదగంట్యాడ: టీడీపీ వ్యవస్థాపకుడు, స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు అగనంపూడిలో ఘన నివాళులర్పించారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పెదగంట్యాడ శాఖ గ్రంథాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకటరావు , గ్రంథాలయ అధికారి పీపీ రమణ, పాఠకులు, నివాళులర్పించారు.

అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే.. అదే పార్టీకి చెందిన కార్పొరేటర్ మధ్య మనస్పర్థలు వార్డు ప్రజలకు శాపంగా మారాయి. దీంతో కరవమంటే కప్పకు కోపం.., విడవమంటే పాముకు కోపం అన్న చందంగా ఈ అంశంపై ఎవరూ నోరు మెదపడం లేదు. లోలోపల మాత్రం కార్పొరేటర్, ఎమ్మెల్యే వర్గాలుగా గ్రామంలో ఆధిపత్య పోరు సాగిస్తున్నారు.దీంతో కల్యాణ మండపం నిర్మాణానికి బ్రేక్ పడింది. ప్రజలు శుభకార్యాలు చేసుకోవడానికి చోటు కరువైంది.

వారి వైరం.. ప్రజలకు శాపం!



తుంగ్లాంలో తొలగించిన పాత కల్యాణ మండపం (ఫైల్)



తొలగించిన మండపం స్థానంలో నిర్మాణానికి తవ్విన పునాదులు

- కల్యాణ మండపం నిర్మాణానికి అడ్డుపుల్ల
- శుభకార్యాలు జరుపుకోవడానికి వేదిక కరువు
- అవస్థలు పడుతున్న తుంగ్లాం ప్రజలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో ఉన్న కల్యాణ మండపం శిథిలావస్థకు చేరడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నూతన కల్యాణ మండపానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆమేరకు అప్పటి మేయర్ హరివెంకటకుమారి, నాటి ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి నూతన కల్యాణ మండపం పనులకు శంకుస్థాపన చేశారు. ఇంతలో ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. ఎన్నికలు అయిన తర్వాత వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి చకచకా పనులు చేపట్టారు. పాత కల్యాణమండపం పూర్తిగా తొలగించి నూతన నిర్మాణానికి పునాదులు తవ్వించారు. ఐరన్, నిర్మాణ సామగ్రి రప్పించారు. హఠాత్తుగా జీవీఎంసీ అధికారులు కల్యాణమండపం నిర్మాణానికి అనుమతులు లేవని చెప్పడంతో గందరగోళపరిస్థితి నెలకుంది.

తొలగించిన చోట నిర్మించినా చెరువు పేరుతో ..

చెరువు పక్కనే కల్యాణం మండపం నిర్మిస్తే ప్రమాదం అని కారణం చూపి జీవీఎంసీ అధికారులు పనులకు బ్రేక్ వేశారు. దీంతో కంగుతిన్న కార్పొరేటర్ గోవిందరెడ్డి జీవీఎంసీ ఈఈ వైఖరిని తప్పుపట్టారు. గతంలో కల్యాణం మండపం ఉన్న ప్రాంతంలో ఇప్పుడు అభ్యంతరం చెప్పడంతో ఈఈపై అగ్గిమీద గుగ్గిలమయ్యారు. స్థానికులతో ఈ విషయంపై చర్చించారు.

లోగుట్టు ఇదీ...

కార్పొరేటర్ గోవిందరెడ్డి, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు మధ్య పొసగకపోవడంతోనే ఎమ్మెల్యే 69వ వార్డులో అభివృద్ధికి మోకాలడ్డుతున్నారని వదంతులు ఉన్నాయి. కల్యాణమండపం నిర్మాణం ఆగిపోవడంతో కార్పొరేటర్ గ్రామంలో కులసంఘాల పెద్దలతో పాటు తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్‌ను సైతం ఆహ్వానించారు. ఇప్పటికే ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్‌కు తీవ్ర విభేదాలు ఉండటంతో ఆయన సమావేశంలో ఎమ్మెల్యేపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇలా కల్యాణమండపం అంశం ఎమ్మెల్యే వర్సెస్ కార్పొరేటర్‌గా మారిపోయింది. మొత్తానికి కల్యాణమండపం నిర్మాణం జరగకపోవడంతో గ్రామంలో శుభకార్యాలు చేసుకోవాలంటే రోడ్లు బంద్ చేయాల్సిందే.

ఎమ్మెల్యేను కలిసిన గ్రామ నాయకులు...

కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయి ఏడాది కావస్తున్నా వార్డులో అభివృద్ధి పనులు జరగడం లేదని గ్రామస్తులు ఎమ్మెల్యే పల్లాను కలిశారు. 69వ వార్డు తుంగ్లాం పరిసర ప్రాంతంలో కల్యాణమండపం నిర్మించాలని కోరారు.



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కల్యాణమండపం నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకం

మండపం లేక ఇక్కట్లు

శుభకార్యాలకు రెడ్డితుంగ్లాం, కాపుతుంగ్లాం, చుక్కవానిపాలెం గ్రామాలకు ఈ కల్యాణ మండపమే దిక్కు. పెళ్లిళ్లు, రజస్వల ఫంక్షన్‌లు, పుట్టినరోజు వేడుకలు, రాజకీయ పార్టీల వేడుకలు, ఉచిత వైద్యశిబిరాలు, ఆధార్ నమోదు తదితర కార్యక్రమాలకు స్వర్గీయ ఎన్టీఆర్ కల్యాణమండపమే ఆధారం. ఇప్పుడు కల్యాణమండపం లేకపోవడంతో ఆయా గ్రామాల వారు ఇంటి వద్దే వీధులను, రహదారులను దిగ్బంధం చేసి టెంట్లు ఏర్పాటు చేసి శుభకార్యాలు చేసుకుంటున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఎఫ్ఆర్‌యూ సందర్శన



ఆస్పత్రి నిర్వహణ గురించి చర్చిస్తున్న అధికారులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెంలోని ఫస్ట్ రిఫరల్ యూనిట్ (ఎఫ్ఆర్‌యూ) నిర్వహణ బాధ్యతలను కోరమాండల్ సంస్థ తీసుకోవాలనే ఆలోచనలో ఉంది. ప్రస్తుతం ఈ ఆస్పత్రి సేవలు సరిగ్గా అందకపోవడంతో ఇక్కడకు వచ్చే రోగుల సంఖ్య బాగా తగ్గింది. దీంతో ఆస్పత్రి నిర్వహణ బాధ్యతలను తీసుకుని.. నామమాత్ర ఫీజుతో పారిశ్రామిక ప్రాంత రోగులకు ఉత్తమ సేవలు అందించాలనే ఆలోచనతో కోరమాండల్ యాజమాన్యం ముందుకు వచ్చింది. దీనిలో భాగంగా ఆ సంస్థకు చెందిన చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్‌తో సహా పలువురు ఉన్నతాధికారులు బుధవారం ఎఫ్ఆర్‌యూను సందర్శించారు. పరిసరాలను పరిశీలించి,పూర్తి స్థాయి ఆధునికీకరణ, వసతుల కల్పనకు అయ్యే ఖర్చు తదితర అంశాలపై చర్చించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: పెదగంట్యాడ 11కేవీ ఫీడర్, ఏపీహెచ్‌బి ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 30న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదగంట్యాడ ఫీడర్ పరిధిలోని గొడ్డువానిపాలెం, దుర్గవానిపాలెం, నెల్లిముక్కు, సీతానగరం, పెదగంట్యాడ మెయిన్ రోడ్డు, బర్మాకాలనీ, బాబు జగ్జీవన్‌రాంనగర్, రైతు బజార్ ఏరియా, ఏపీహెచ్‌బీ ఫీడర్ పరిధిలో ధర్మాల వీధి, ఎస్సీ కాలనీ, అరుణ కాంప్లెక్స్, నీలాపు వీధి, గొడ్డువానిపాలెం నోవాస్-పోర్టు రోడ్డు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం తప్పదన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు అన్యాయం



కాంట్రాక్ట్ కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

- తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి
- అవసరమైతే ప్రజాప్రతినిధుల ఇళ్లు ముట్టడిస్తాం
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల నిరవధిక సమ్మెకు సీపీఐ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి ప్రకటించారు. ఉక్కు పరిపాలన భవనం వద్ద బుధవారం చేపట్టిన ఆందోళనకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్ కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు 8 వేల మందికి ఇప్పటికీ ఉద్యోగాలు లభించలేదన్నారు. ఎన్నికల ముందు ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షిస్తామని, నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని ప్రజాప్రతినిధులు విస్మరించడం దుర్మార్గమన్నారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామన్నారు. ఉక్కు యాజమాన్యం కార్మికులను తొలగించడం సమంజసం కాదన్నారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్మికులు 9 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా యాజమాన్యంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు షేక్ రహమాన్, కసిరెడ్డి సత్యనారాయణ, ఎం. మన్మథరావు, ఎస్. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: మారుతీ సర్కిల్ నుంచి ములగాడ మార్గంలో రైల్వే గేటు సమీపాన రోడ్డు పక్కన గుర్తు తెలియని మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించి గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతి చెందిన వ్యక్తి 3 నెలలుగా చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో బిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్లు ఉంటాయని తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి తెలియరాలేదన్నారు. ఎవరైనా గుర్తు పడితే గాజువాక సీఐ 9440796014, ఎస్ఐ 9642364770 నంబర్లకు తెలపాలన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు



డాక్టర్ పద్మజను సత్కరిస్తున్న నాయకులు

అగనంపూడి: యూనియన్ ఆఫ్ స్టీల్ ఎంప్లాయిస్ (యూజ్) ఆధ్వర్యంలో అగనంపూడి ఏరియా ఆస్పత్రి వైద్యుల సహకారంతో 85వ వార్డు దానబోయినపాలెంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్యురాలు డాక్టర్ కణితి పద్మజా మాట్లాడుతూ సుమారు 50వేల మంది నిర్వాసితులు, నిరుపేదలు ఉన్న అగనంపూడి నిర్వాసితకాలనీల్లో ఉచిత వైద్య సేవలు అందించడం సంతోషంగా ఉందన్నారు. శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులకు మాస్కులు, శానిటైజర్లు అందించారు. 300 మందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పరంధామయ్య, గుడే సుశీలా గజేంద్రరావు, బలిరెడ్డి సత్యనారాయణ, మడుగల నరసింగరావు, సాయిన సన్యాసిరావు, కిడిమి హనుమంతురావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత భోజన మొబైల్ వాహనం ప్రారంభం



మొబైల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న జోనల్ కమిషనర్ శేషాద్రి

గాజువాక: ప్రపంచ ఆకలి దినోత్సవాన్ని పురస్కరించుకొని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ గ్రూప్ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఉచిత భోజన మొబైల్ వాహనాన్ని గాజువాక జోనల్ కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు మధ్యాహ్నం 200 మందికి ఉచిత భోజన వసతి కల్పించేందుకు వీలుగా మొబైల్ వ్యాన్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. మలబార్ గోల్డ్ సంస్థ గాజువాక ఇన్‌చార్జి మహమ్మద్ సాహిన్ ఇసాక్ మాట్లాడుతూ గాజువాక పరిధిలో నిత్యం 200 మందికి ఉచిత భోజనం అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా సతీమణి లావణ్యాదేవి, సింహగిరి ఆస్పత్రి అధినేత డాక్టర్ కల్యాణ్, రక్తనిధి ఇన్‌చార్జి వినోద్‌బాబు, మలయాలీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వర్గీస్, బిజూ, గాజువాక మేనేజర్ ఆనంద్, అనూష పాల్గొన్నారు.

సినిమా థియేటర్లలో తనిఖీలు



కన్య థియేటర్‌లో ఆహారపదార్థాలను తనిఖీ చేస్తున్న రెవెన్యూ అధికారులు



అరుణా థియేటర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న తహసీల్దార్ అమల

గాజువాక: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గాజువాక ప్రాంతంలోని సినిమా థియేటర్లలో రెవెన్యూ అధికారులు బుధవారం తనఖీలు నిర్వహించారు. ఆర్డీవో శ్రీలేఖ ఆధ్వర్యంలో అధికారులు ఈ ప్రాంతంలోని అన్ని థియేటర్లను పరిశీలించారు. ఆహార పదార్థాలను విక్రయిస్తున్న ధరలతో పాటు ఫైర్ అండ్ సేఫ్టీకి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. థియేటర్లలోని టాయ్‌లెట్లను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన చెక్ లిస్టు ఆధారంగా వివరాలు నమోదు చేశారు. కార్యక్రమంలో గాజువాక తహసీల్దార్ టి.శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

అరుణా థియేటర్‌లో...

పెదగంట్యాడ: సినిమా థియేటర్ నిర్వహణ సక్రమంగా లేకపోతే చర్యలు తీసుకుంటామని పెదగంట్యాడ తహసీల్దార్ పి.అమల హెచ్చరించారు. పెదగంట్యాడలోని అరుణా పిక్చర్ ప్యాలెస్‌లో బుధవారం ఆమె తనిఖీలు నిర్వహించారు. థియేటర్‌లోని సీట్లు, ఏసీ, బయట పార్కింగ్, తిను బండారాల స్టాళ్లు, వాటి ధరలు, నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వోలు లక్ష్మీ కాంత్, హరీష్, రహీం తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిపై డీఎంహెచ్‌వో ఆగ్రహం



నరసింహనగర్ యూపీహెచ్‌సీలో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: నరసింహనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు బుధవారం సందర్శించారు. ఈ ఆరోగ్య కేంద్రం పలు కార్యక్రమాల అమలులో వెనుకంజలో ఉండడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అభ ఐడి నమోదు, ఎన్‌సీడీసీడీ సర్వే, వ్యాధి నిరోధక టీకాల అమలు వేగవంతం కావాలన్నారు. ఈ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం తగదన్నారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ప్రణాళికాబద్ధంగా జరగాలని, నిర్దేశించిన సూచనల ప్రకారం వ్యాక్సిన్ తెచ్చుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ఓపీ, ల్యాబ్ టెస్టులు, సాధారణ ప్రసవాల గురించి వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆశ కార్యకర్తలు తమ ఏఎన్ఎంలతో కలిసి గర్భిణులకు టీటీ, ఐరన్ ఫోలిక్ మాత్రలు అందేటట్లు, ఎనీమియా బారిన పడకుండా చూడాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ లూసీ, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, డీపీఎంవో, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి కుమారుడు ఐఎఫ్ఎస్‌కు ఎంపిక



తల్లిదండ్రులతో బిపుల్ గుప్తా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్ పవన్ కుమార్ గుప్తా కుమారుడు బిపుల్ గుప్తా ఇటీవల వెలువడిన సివిల్స్ ఫలితాల్లో 368వ ర్యాంకు లభించిన విషయం తెలిసిందే. ఆయనకు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్(ఐఎఫ్ఎస్)లో 12వ ర్యాంకు కేటాయించారు. వాస్తవానికి ఇండియన్ రెవెన్యూ సర్వీసు కూడా లభించే అవకాశం ఉంది. అయితే చిన్ననాటి నుంచి అడవులు, ఆటవీ శాస్త్రంపై అభిలాష ఉన్న బిపుల్ గుప్తా ఐఎఫ్ఎస్‌లో చేరడానికి మొగ్గుచూపారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. కాగా బిపుల్‌గుప్తా ఉక్కు నగరం డీపీఎస్‌లో 10వ తరగతి చదివాడు. 2022లో ఐఐటీ మద్రాసులో బీటెక్ పూర్తి చేశారు. బిపుల్ గుప్తా తల్లి డాక్టర్ దీప గుప్తా ప్రముఖ యూట్యూబర్ కాగా, ఆయన సోదరుడు మృదుల్ గుప్తా ప్రస్తుతం ఐఐటీ మద్రాస్‌లో బీటెక్ చదువుతున్నారు. ఆయన మాట్లాడుతూ అడవుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్న మలేరియా నివారణ సిబ్బంది

సింధియా: డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా తదితర సీజనల్ వ్యాధుల ప్రబల కుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ బయాలజిస్ట్ జి.వరప్రసాద్ సూచించారు. జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి భద్రత అనే విషయాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. తమ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడంతో పాటు ఇంట్లోని ట్యాంకులు, కుండీలను వారానికి ఒక రోజు శుభ్రపర్చడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చునన్నారు. గృహాల్లో లభ్యమయ్యే చెత్తను రోడ్లు, కాలువల్లో వేయకుండా శానిటరీ సిబ్బందికి అందించాలని సూచించారు. పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్ వినియోగాన్ని ఎవరికి వారుగా నియంత్రించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మల్కాపురం ఏరియా మలేరియా ఇన్‌స్పెక్టర్ డి. రవికుమార్, వార్డు మలేరియా సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జూలో ధోల్ డే సందడి



ఆసియాటిక్ వైల్డ్ డాగ్ చిత్రం వేస్తున్న చిన్నారి

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో బుధవారం ప్రపంచ ధోల్ డే(ఆసియాటిక్ వైల్డ్ డాగ్స్ డే) నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిత్రలేఖనం పోటీల్లో నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆసియాటిక్ వైల్డ్ డాగ్స్ చిత్రాలతో అలరించారు. జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ ఆసియా ఖండంలోని అడవి కుక్కల జాతినే ధోల్‌గా పిలుస్తారని తెలిపారు. ధోల్ ప్రపంచంలో ధోల్ ప్రాణులు అంతరించిపోతున్నాయన్నారు. దీని బ్రీడింగ్ సెంటర్‌ను విశాఖ జూలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ డాగ్స్‌పై అవగాహన కల్పించడానికి పిల్లలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. జూలో ప్రస్తుతం 47 ఆసియాటిక్ వైల్డ్ డాగ్స్ ఉన్నాయని, వాటిలో 28 మగవి కాగా.. 19 ఆడవి అన్నారు.

సాహితీవేత్తలకు ప్రతిభా పురస్కారాల ప్రదానం

సీతంపేట: నవసాహితి ఇంటర్నేషనల్, బొంబాయి తెలుగు సాహిత్య సమితి సంయుక్త నిర్వహణలో విశిష్ట ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో నవసాహితి ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎస్.వి.సూర్యప్రకాశరావు తమ సంస్థ కార్యకలాపాల గురించి వివరించారు. ఈ సందర్భంగా గురజాడ కవితా పురస్కారాన్ని కవి కె.జి. వేణుకు, విశిష్ట సాహితీ పురస్కారాలను సాహితీవేత్తలు డాక్టర్ డి.వి.సూర్యారావు, ఆచార్య వెలమల సిమ్మన్నకు ప్రదానం చేసి సత్కరించారు. జర్రా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింప జేసి, ఉదయం 9.30 నుంచి వివిధ ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.